# "బతుకుదెరువు లేకుంటయిపాయె"

మా ఊళ్ళె ఏ కులపోల్లయిన ఒకర్నొకరు వరుసలుపెట్టి పిలుసుకుంటరు. బావ-బామ్మర్దులు, తాత-మనమలు, వదినె-మరదండ్ల వరుసయినోల్లు పరాశికాలాడుకుంటరు. నేనోపారి ఊరికెళ్ళినపుడు బువ్వదిని పాత సోపతోల్ల కలిసత్తనని మా సెంద్ర మొగిలి ఇంటిమొకాన నడుత్తన్న. సాలె బూదమ్మ నాకు వదినె వరుసైతది. పనికి పోవుటానికి తయారై వాకిట్ల కూసున్నది. ఎర్రగొర్రెలె, పండిన సేపోలె వుండేటి బూదమ్మ మొకం పాలిపోయుంది. దవుడలు లోపలికి పోతున్నయి. నేను కాలేజీల సదువుకునేటప్పుడనుకునేటోన్ని. గీ బూదమ్మ ఉన్నోల్లిండల్ల పుడితెంత మంచి గుండేటిదని. గిప్పుడు సూత్తంటె ముప్పయిదేండ్లన్న రాకముందే ముసల్దానోలయిపెయింది. నాకు సిన్నప్పటికెల్లి ఆడోల్లతోని మాట్లాడు సిగ్గనిపించినా బూదమ్మ మాట్లాడితె మాత్తురమెంత సేపయిన మాట్లాడన్ననిపిత్తది. నేనామెను చూసి గూడ దాటిపోతంటె పిల్సింది.

"ఏంది పిలగ మాట్లాడకుంటనే పోవట్తివేంది?" అంది.

"నిన్ను చూల్లే" చిన్న అవద్దమాడిన.

"అవద్దమాడినా అతికినట్టుండాలె. నీ కది సాతగాదు గని నువ్వెప్పుడచ్చినవు?" అంది.

"నిన్ననే" "అంత మంచిదేనా"?

"మంచిదే కని నువ్వుట్లున్నవు?"

"నన్ను జూత్తె కనవడుత లేదా మరిది? ఇగో గిట్లున్న"

"ఏందేమో మునిగిపెయినట్టే సెయ్యవట్తివి. ఎర్రగ బుర్రగ మంచిగనే ఉన్నవుగద"? పరాశికమాడిన.

"నీకండ్లకు నేనింక పడుసుపోరోలె కనవడ్తన్నలే?"

"లేకుంటేంది మరి? మా అన్న సంపాయిత్తంటె మంచిగ కూసుండి తింటున్నవు?" తెలిసుండి గూడ ఉడికియ్యన్నని అన్న.

"అవు పిలగ......! నువ్వన్నది నిజమే. మీ అన్న నన్ను రోజు టుంగుటూయాలల కూసుండవెట్టి ఊపుడేనాయె. కాలుగూడ కిందవెట్టనీయకపాయె. నాకు పనెట్లుంటదో గూడ తెలువది. అబ్బ! కొద్ది సుకపడ్తన్నా పిలగ....!" నిష్టూరంగంది.

"అట్ల గమ్మతుకంటె కొలువు గొలిసినట్టు చెప్పవడితివేంది? పనిజెయ్యందెవ్వలకెల్లుద్దో చెప్పు? కూసుండి తింటె గుట్టలయిన తరుగుతయంటరు. పన్జేస్తేమన్నరిగి పోతవా తియ్యలేవు......?"

"నీ కారెడ్డం[7] మాటలకేంది గని. ఏంపని పిలగ.......?

గీ రెక్కల కొక్కనాడన్న రికాముందా? గా సద్దుల బతుకమ్మ, దసర, గణేశపూజ గిసొంటి ఐదారు పండుగల్నాడు దప్పుతె యాడాది పొడుగూతెన్నడన్న వర్తిగున్నదున్నదా మరిది? ఇద్దరం సేత్తేనే సాల్తలేకపాయె. రోజురోజుకు పొల్లగాండ్లు పెద్దోల్లు గావట్టిరి" అంది విచారంగ బూదమ్మ.

"నిజమే........! నాకు తెలువదా గని వదినెవని అట్ల పరాశికెమాడిన. అయితే మానాయె గని అన్న బట్టలబ్యారం మంచిగ నడుత్తందా."

"అయ్యో! నీ కెరకలేదా పిలగ......! గా ఆదిలాబాద్దిక్కు మునుపటోలె బ్యారాలు నడుత్తలెవ్వు. కోయోల్లు, గొండోల్లు గూడ తెలివికచ్చింద్రు. అక్కడ గూడ కొన్ని దుకాండ్లయినయట. మల్ల మునుపేమో ఇంటికొక్కలు బ్యారం జేసెటోల్లుంటే గిప్పుడేమో ఇంటికి నలుగురైరి. మునుపు మా ఇంట్ల మా మొక్కడే గటుపాయెటోడా? గిప్పుడాయెనకు పుట్టిన నలుగురు గదే పని జెయ్యవట్టిరి. ఇగ మునుపటోలె గిరాకేడుంటది సెప్పు? గందుకే అటుపోవుడు బందువెట్టింద్రు......"

"మరేం జేత్తండన్న.....?"

"కోయగొండ ఎడ్డిరాజ్జెంల బ్యారాలు బందు గాంగనే మా అసొంటోల్లకు బతుకుదెరువు లేకుంటయింది పిలగ! అటెనుక సొంచెలమీన పన్జెయ్యపెయిండు. అదేం పోగు పొయ్యలే. ఆర్నెల్లకోపారన్న ఇంటిమొకం సూసుడు లేకపాయె. సరే ఎట్లనో బతుకుదామంటె గదిగూడ కడుపు నింపకపాయె. మల్ల అక్కడ మస్తుగ లొల్లులైతన్నయట. అక్కడుండుడు గాక ఎల్లచ్చిండు. ఏడిండ్ల పిల్లి కూనోలె తిరుగుడయితంది గద........!"

బూదమ్మ మొకంల ఎంతో విచారం.

"గివ్వన్ని నాకు తెలువయదినె. నౌకరయినంక నేనుండేది గా గోదావరిఖనెనాయె. వచ్చినప్పుడట్ల సోపతికాల్లను[8] కలుసుకొనిపోతి. నువ్వు కనవడకనయితె సానొద్దులాయె" అన్న.

"అటెనుక సైకిలుమీన బట్టల ముల్లెలు పెట్టుకొని సుట్టూర్లపొంటి తిరిగమ్మిండు. కాని గది గూడ నడవలే. గిట్ల తిరిగేటోల్లు తోకతొంబయి మందయిరి. మల్ల కొంచమంతో తీరుగున్న ఊళ్ళళ్ళ పెద్దపెద్ద దుకాండ్లాయె. ఇగ గిల్ల దగ్గరెవ్వలు గొంటరు సెప్పు? గీ బ్యారెంతోని పొట్టకెల్లుడే కట్టమయితంది వశంగాక గది గూడ బందు జేసిండు".

"అరెరే....? అన్న సాన కట్టపడుతండన్నమాట. పొట్ట తిప్పలకు జెర్రిపోతులాటని"

"ఏం జెయ్యమంటవు మరిది? ఎక్కడికి పోయినా గని ఏడేమాన్కలన్నట్టు బతుకుదెరువు లేకుంటయిపోవట్టె. రోజురోజుకు పిల్లగాండ్లెదుగవట్టిరి. కరుసలు పెరుగవట్టె. ఇగ కట్టమో, నిట్టూరమో ఎట్లయిన మంచిదేనని ఐదువేల రూపాయలు పైరవోనికట లంచమిచ్చి బెల్లంపెల్లిల బొగ్గుబాయిల పనిజేత్తండు. గిప్పుడయితె గా ఉరుకుట్ల గది గూడ దొరుకుకపోవు. పాపం మీ అన్నేమన్న గిసొంటి తట్టమేసే కట్టం జేసినోడా? గా బట్టపేగులమ్ముకుంట బతికినోడేనాయె. ఎమసప్పుని సేసినోల్లకయితె బాయిపనో మోతాదు గాదు. బాయి లోపలికి కాల్లీడ్సుకుంట దిగేవరకే పానం కొలికిలకత్తందట. మల్ల తట్టమోసుడాయె. లోపల గ్యాసుంటదట. పన్జెయ్యసాతగాక, గా గ్యాసు పడక ఏనుగోలున్నోడు పీనుగోలయ్యిండు. అయినెం జూత్తే పానమయిసిపోతంది. కనేం జేసుడు పిలగ" కండ్లనీల్లు దీసుకుంట జెప్పింది బూదమ్మ.

"కండ్లపొంటి నీళ్ళెందుకు వదినె! మరి నువ్విక్కన్నే ఉంటున్నవా? పొయ్యిపొయ్యి అచ్చెటాల్ల కింత వండిపెట్టుంటె మంచిగుంటది గద! అక్కడికే పోకపోయినవా?" అన్న.

ఇద్దరు పొల్లగాండ్లిక్కడ సదువుకోవట్టిరి. గీ నడుమపొతె సదువంత గడెబెడయితదనాగుతున్న. ఎండకాలమయిపోయి మల్ల బల్లు మొదలైనంక ఆల్లనక్కన్నే బల్లేత్తం. నేనిక్కడున్నట్టే కని నా పానమయితక్కన్నే ఉంది. పొయ్యిపొయ్యొచ్చి ఏందింటండో! ఎట్లుంటడో పాపం.....! గా బ్యారాల్నడిత్తె గీ మోటుకట్టం తప్పేటిదాయనెకు...!"

"గిప్పుడు ఆదిలాబాద్దిక్కు మునుపటోలె నడుసుడు కట్టం. ఆల్లంత తెలివికచ్చింద్రు. ఆల్లకు అన్నల మద్దతుంది. సరె గని అన్న తాపకోపారి వచ్చిపోతండా?"

"అయినె సెత్తేగక్కడుంది గని మనుసంతిక్కన్నేనాయె. పదిగేను దినాలకోమల్క మా వచ్చిపోతండు. కని రోజురోజు కెండుకత్తండు పిలగ.......! ఎట్లుంటడో ఏమో నాకేం మనుసున వడుతలేదు" బాదపడుకుంటది బూదమ్మ వదినె.

"నువ్వెటో పోతున్నట్టువు గద పో. నేం గూడ నాటెయ్యపోవాలె" అని లేచినిల్సుంది. మొగన్ని మొదాలు నిట్టూరంగ మాట్లాడిన బూదమ్మకు అయనెమీదున్న మనుసు సూత్తంటె నా మనసు బరువై కండ్లు చెమర్చినయి.

"మంచిది వదినె. నేం బోతన్న. ఏంగాదు బయపడకు. కొన్నొద్దులయితె అలవాటయితదు. నువ్వక్కన్నే ఉండి మంచిగండిపెడతె ఆరోగ్గెం మంచిగుంటది. అన్న నెండవెట్టుకుంట పైసలను జమ నెయ్యన్నని మాత్తురం జూడకు. బతికిన కాడికాయె. బూదమ్మతోనని అక్కన్నుంచెల్లిపెయిన.

వృత్తులు నశించి బతుకులు పెయిన ఎంతోమంది కండ్లముందు కదులుతరు నాకు. బూదమ్మ మాటలు యాదికత్తె ఊళ్ళు కండ్లముందు కదిలొ మనుసు బరువైతది.